సాక్షి
నల్లగొండ
మంగళవారం। 17। సెప్టెంబర్। 2024



ఘాటెక్కిన ఉల్లి, వెల్లుల్లి
ధరలు మండుతున్నాయి. ఉల్లి కిలో రూ.30 నుంచి రూ.70కి, వెల్లుల్లి రూ.200 నుంచి రూ.400కు పెరిగాయి.

- 8లో

సాగర్ సమాచారం




పూర్తిస్థాయి నీటి మట్టం:	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.90 అడుగులు
ఇన్‌ఫ్లో	: 68,327 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 22,366 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,948 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,000 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 4,613 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	644.15 అడుగులు
ఇన్‌ఫ్లో	: 445.23 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 692.46 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 315.31 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 315.31 క్యూసెక్కులు



బాంచన్ బతుకుల విముక్తి

- 1948 సెప్టెంబర్ 17న భారతదేశంలో నిజాం సంస్థానం విలీనం
- రజాకార్ల పీడ విరగడైందని సంబరాలు జరుపుకున్న ప్రజలు
- సాయుధ పోరు కొనసాగింపునకు కమ్యూనిస్టుల్లో కొందరి మొగ్గు
- 1951 అక్టోబర్‌లో సాయుధ పోరు విరమణ

1948, సెప్టెంబర్ 17.. తెలంగాణకు చరిత్రాత్మక దినం. భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్య్రం వచ్చినప్పటికీ నిజాం పాలనలో ఉన్న తెలంగాణ స్టేట్ ప్రజలు మాత్రం స్వేచ్ఛా, స్వాతంత్య్రాల కోసం సాయుధ పోరు నడిపారు. కమ్యూనిస్టులు ఆంధ్ర మహాసభ పేరుతో వీరోచిత పోరాటం సాగించారు. అప్పటి భారత ప్రధాని నెహ్రూ నాయకత్వంలో హోంమంత్రి సర్దార్ వల్లభాయ్‌పటేల్ పోలీస్ చర్యకు ఉపక్రమించారు. ఆపరేషన్ పోలో పేరుతో చేపట్టిన ఈ సైనికచర్యతో నిజాం రాజు లొంగిపోయి.. భారత యూనియన్‌లో విలీనమవుతున్నట్లు ప్రకటించారు.

సాక్షి, యాదాద్రి, సూర్యాపేట, కోదాడ

1948, సెప్టెంబర్ 17న నిజాం రాజు భారత ప్రభుత్వానికి లొంగిపోయాడని రేడియో ద్వారా తెలుసుకున్న ప్రజలు ఆనంద పరవశంతో సంబరాలు చేసుకున్నారు. కమ్యూనిస్టు పార్టీలో మితవాదులుగా పేరుబడ్డ నాయకులు తమ ప్రాబల్యం ఉన్న గ్రామాలు, పట్టణాల్లో జెండా ఎగురవేసి సంబరాలు సాగాయి. సూర్యాపేట ప్రాంతంపైన అప్పటికే బొమ్మగాని ధర్మభిక్షం ప్రాబల్యం ఉండేది. ఆయన నేరుగా పాల్గొనక పోయినా ఆయన అనుచరులు సూర్యాపేట బొడ్రాయి బజారులో జెండా ఆవిష్కరించినట్లు తెలిసింది. తుంగతుర్తి ప్రాంతంలోని వెంపటి, నాగారం, వర్ధమానుకోట, అన్నారం లాంటి గ్రామాల్లో సంబరాలు జరుపుకున్నారు. ప్రజలు మంగళహారతులు, మేళతాళాలతో ర్యాలీలు నిర్వహించి జై జై అంటూ నినాదాలు చేశారు.



ఇళ్లకు మామిడి తోరణాలు కట్టుకుని.. వాకిళ్లలో ముగ్గులు వేశారు. రజాకార్ల పీడ విరగడైందని గ్రామంలో చాటింపు వేయించారు. ఆడవాళ్లు తలంటు స్నానాలు చేసి గుళ్లలో పూజలు చేశారు. యువకులు గ్రామ చావడిలో మంటలు వేసి వాటి చుట్టూ కేరింతలు కొడుతూ గడిపారని అప్పటి నాయకులు చెప్పారు.

దళాలకు ఆయుధాలిచ్చిన ప్రజలు

పోలీస్ చర్యను సాయుధ దళాలు, ప్రజలు అవకాశంగా తీసుకున్నారు. ప్రజలు అనేక రజాకర్, పోలీస్ క్యాంపులపై దాడులు చేసి ధ్వంసం చేశారు. ఆయుధాలు, తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట తాలూకాలో పారిపోతున్న నైజాం సైనికులను ప్రజలు, స్థానిక దళాలు తరిమికొట్టి పెద్ద సంఖ్యలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. దురాజ్‌పల్లి కొండల సమీపంలో భారత విమాన బలగాల బాంబుదాడి ఫలితంగా మృతిచెందిన నిజాం సైనికుల నుంచి రైఫిళ్లు, స్టెన్‌గన్‌లు, చేతిబాంబులను ప్రజలు హస్తగతం చేసుకుని దళాలకు అప్పగించారు.

బేతవోలు గడి కూల్చివేత



ఆనాడు నిజాం నివాబు అండతో బేతవోలుకు చెందిన దొర తడకమళ్ల సీతరాంచందర్‌రావు ప్రజలను హింసించే వాడు. కమ్యూనిస్టు నాయకులు అతడిపై దాడి చేయడానికి అనేక సార్లు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలో నిజాం నవాబు లొంగిపోయాడని తెలుసుకున్న చిల్కూరుకు చెందిన కమ్యూనిస్టు నాయకుడు దొడ్డా నర్సయ్య ఆధ్వర్యంలో ప్రజలు బేతవోలులో ఉన్న రాంచందర్‌రావు గడిపై దాడి చేశారు. గడ్డపారలతో గడిని కూల్చివేశారు. దాడి విషయాన్ని ముందే పసిగట్టిన రాంచందర్‌రావు పారిపోయి ప్రాణాలను దక్కించుకున్నాడు. గడిని కూల్చివేసిన అనంతరం కాగడాలను చేత పట్టుకొని ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో దొడ్డా నర్సయ్య ప్రజాకోర్టు నిర్వహించి వెలిదండకు చెందిన ఇద్దరికి శిక్షలు వేసినట్లు నాటితరం వారు చెపుతున్నారు.

కమ్యూనిస్టులపై సైన్యం దాడులు

సాయుధ పోరాటంతో రజాకార్లు, దొరలు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు, జమీందార్ల కబంధ హస్తాల నుంచి గ్రామాలను విముక్తి చేస్తున్న కమ్యూనిస్టులపై యూనియన్ సైన్యాలు దాడులుపెంచాయి. వందలాది గ్రామాల్లో ఆంధ్ర మహాసభ నాయకులు, కార్యకర్తలను ఇండియన్ మిలటరీ కాల్చి చంపింది. ఆనాటి పోరులో అమరులైన వందలాది మంది స్థూపాలు ఇప్పుడు సజీవ సాక్షాలుగా నిలుస్తున్నాయి.

1951లో సాయుధ పోరాట విరమణ

తెలంగాణలో 1946లో సాయుధ పోరాటం ప్రారంభమైంది. 1948 సెప్టెంబర్ 17న నిజాం భారత దేశంలో విలీనమైన ఈ అంశంపై కమ్యూనిస్టు పార్టీలో భిన్నాభిప్రాయాలు చోటుచేసుకున్నాయి. సాయుధ పోరాటాన్ని కొనసాగించాలని కొందరు.. విరమించాలని మరికొందరు అన్నారు. మూడు సంవత్సరాల అనంతరం ఆనాటి కమ్యూనిస్టు పార్టీ 1951లో సాయుధ పోరాట విరమణ ప్రకటించింది.

న్యూస్‌రీల్

పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఆవిష్కరించనున్న మంత్రి

నల్లగొండ: తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తారని, అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి సందేశం ఇస్తారని పేర్కొన్నారు. తదుపరి బాలబాలికల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలు, అన్ని కార్యాలయాల్లో మంగళవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

నిత్యావసర సరుకుల వాహనం ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ టౌన్: ఖమ్మం జిల్లాలోని 300 వరద బాధిత కుటుంబాలకు నల్లగొండ జిల్లా రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో రూ.4 లక్షల విలువ గల నిత్యావసర సరుకులు, వంట సామగ్రి తీసుకెళ్తున్న వాహనాన్ని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సోమవారం జిల్లా కేంద్రంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి, మందడి నర్సిరెడ్డి, పుల్లారావు, శ్రీనివాస్‌రెడ్డి, కోటేశ్వరరావు తదితరుల పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్‌ల తనిఖీ

నల్లగొండటౌన్ : గణేశ్ నిమజ్జనం సందర్భంగా నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్, వల్లభరావు చెరువు వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌లను సోమవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తనిఖీ చేశారు. అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ నిమజ్జనానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే సిబ్బంది స్పందించి సరైన వైద్యం అందించాలని సూచించారు. 108 వాహనంలో అన్ని సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 108 వాహనాల్లో బాధితులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.



మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

వినాయక.. సెలవిక



నల్లగొండలోని క్లాక్‌టవర్ వద్ద గణేశ్ శోభాయాత్ర



గణేశ్ శోభాయాత్రలో డోలు వాయిస్తున్న మహిళ



నల్లగొండలోని వల్లభరావు చెరువులో నిమజ్జనం

- కనులపండువగా గణేశ్ శోభాయాత్ర
- గంగ ఒడికి చేరిన గణనాథుడు
- జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా నిమజ్జనాలు
- తీన్మార్ స్టెప్పులు, కోలాటాలతో అలరించిన యువత

నల్లగొండ రూరల్: నవరాత్రులు పూజలు అందుకున్న వినాయకుడు సోమవారం గంగమ్మ ఒడికి చేరాడు. వెళ్లి రావయ్య గణపయ్య అంటూ జిల్లావ్యాప్తంగా భక్తులు భక్తి పారవశ్యంతో గణేశ్ నిమజ్జనం నిర్వహించారు. మహిళల కోలాటాలు, వాహనాలకు మైక్‌లు అమర్చి యువత తీన్మార్ స్టెప్పుల తో గణనాథుడి శోభాయాత్ర నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 6 వేల విగ్రహాలు ఏర్పాటు చేయగా 5 వేల విగ్రహాలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. మిర్యాలగూడ డివిజన్‌లో వాడపల్లి, మఠంపల్లి, అడవిదేవులపల్లి, టెయిల్‌పాండ్‌లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. దేవరకొండ ప్రాంతంలోని కొండభీమనపల్లి, డిండి, పుట్టంగండిలో.. నల్లగొండ పట్టణంలోని వల్లభరావు చెరువులో గణనాథులను నిమజ్జనం చేశారు. పెద్ద విగ్రహాలను హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 14వ మైలు వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ఘాటుకు తరలించారు. మరికొన్ని విగ్రహాలను మఠంపల్లి, భద్రాచలం, శ్రీశైలం, మంత్రాలయం, విజయవాడ, రాజమండ్రి ప్రాంతాలకు తరలించారు.

గణేశ్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

నల్లగొండ : గణేశ్ నిమజ్జనం సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకున్నామని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం అనుముల మండలం హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 14వ మైలు వద్ద ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి గణేశ్ నిమజ్జనం ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విగ్రహాలు తీసుకొచ్చిన వారితో కాకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన వారి ద్వారానే విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయించాలని ఆదేశించారు. నిమజ్జనం నిర్వహించే చోట గజ ఈతగాళ్లు, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, అన్ని శాఖల ఉద్యోగులు సిద్ధంగా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రథమ చికిత్స కిట్లతోపాటు, ఓఆర్‌ఎస్ ద్రావణం ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వారి వెంట పోలీసు సిబ్బంది, తహసీల్దార్, ఎంపీడీఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అలీనగర్ వద్ద సాగర్ ఎడమకాల్వలో గణేశుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

భారీ భద్రత..

గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. ఎస్పీ శరత్ చంద్రపవార్‌తో పాటు ఇద్దరు ఏఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 28 మంది సీఐలు, 70 మంది ఎస్‌ఐలు, 620 మంది ఏఎస్‌ఐలు, హోంగార్డులు, ఏఆర్ సిబ్బందితోపాటు అదనంగా మరో 250 మంది ట్రెయినీ కానిస్టేబుళ్లు బందోబస్తులో పాల్గొన్నారు.

లడ్డూ వేలం పాట

జిల్లా వ్యాప్తంగా గణనాథుడి లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించారు. నల్లగొండలోని పాత బస్తీ ఒకటో నంబర్ విగ్రహం వద్ద లడ్డూను రూ.13 లక్షల 50 వేలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి దక్కించుకున్నారు. గత ఏడాది ఇదే మండపంలో లడ్డూ రూ.36 లక్షల వేలం పలికింది.



నల్లగొండలో విగ్రహాలను నిమజ్జనానికి తీసుకొస్తున్న భక్తులు



నల్లగొండలోని శ్రీనగర్ కాలనీలో శోభాయాత్రలో భక్తుల కోలాటం

మతసామరస్యానికి ప్రతీక నల్లగొండ



నల్లగొండలోని పాతబస్తీ గణేశ్ విగ్రహం వద్ద పూజలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- పాతబస్తీ వినాయకుడి విగ్రహం వద్ద పూజలతో శోభాయాత్ర ప్రారంభం

రామగిరి(నల్లగొండ): మతసామరస్యానికి నల్లగొండ జిల్లా ప్రతీకగా నిలిచిందని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్ ఒకటో నంబర్ వినాయక విగ్రహం వద్ద మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి గణేశ్ శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జిల్లాలో అన్ని మతాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇందులో భాగంగా నల్లగొండలో ఈద్గాను అభివృద్ధి చేశామన్నారు. అలాగే ఆంజనేయస్వామి ఆలయాన్ని సైతం అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ గణేశ్ నిమజ్జన వేడుకల సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులకు, అధికారులకు సూచించారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లాలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు 600 మందికిపైగా పోలీసులు, అధికారులు, సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం నల్లగొండ పట్టణంతోపాటు జిల్లాలో వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు కృషిచేసిన కలెక్టర్, ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, పోలీసు అధికారులు, ఆర్డీఓ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులను మంత్రి శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, అప్పల ప్రసాద్, చింత సాంబమూర్తి, శాంతి కమిటీ సభ్యులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు ఖలీమ్, హఫీజ్, గోలి మధుసూదన్‌రెడ్డి, సంపత్, నాగం వర్షిత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్, అబ్బగోని రమేష్ గౌడ్, ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పక్కన కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ తదితరులు

సాయుధ పోరాటంతోనే విముక్తి

నల్లగొండ రూరల్ : వెట్టి చాకిరీ నుంచి ప్రజలకు విముక్తి కల్పించింది తెలంగాణ సాయుధ పోరాటమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి నల్లగొండ మండలంలోని అప్పాజీపేటలో జరిగిన శౌర్య యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన సాయుధ రైతాంగ పోరాటంలో అమరవీరులను స్మరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో శౌర్యయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఎర్రబోతు రామిరెడ్డి స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కట్ట నరసింహ, పాలడుగు నాగార్జున, ఎర్రబోతు రామిరెడ్డి సతీమణి సక్కుబాయమ్మ, కుమారుడు భాస్కర్‌రెడ్డి, పీ.నర్సిరెడ్డి, కొండా అనురాధ, నలపరాజు సైదులు, నాంపల్లి చంద్రమౌళి, పోల సత్యనారాయణ, నలపరాజు సైదులు, బొల్లు రవీందర్, గుండాల యాదగిరి, పందుల భిక్షం, కల్లూరి నగేశ్, కల్లూరి సత్తయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సోమవారం విశేషంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, శ్రీస్వామి మూలవిరాట్‌కి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదంను రక్తి కట్టించారు. విష్వక్సేనారాధన , రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధు ఫర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శివాలయంలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారం ఘనంగా నిర్వహించారు. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు విశేషంగా చేపట్టారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో ఆధ్యాత్మికపర్వాలు కొనసాగాయి. వేకువజామున స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సుప్రభాతసేవ చేపట్టారు. అనంతరం నిజాభిషేకం, తులసీదళ అర్చన చేశారు. ఇక ఆలయ ముఖమండపం, ప్రాకార మండపంలో నిత్యకల్యాణం, శ్రీసుదర్శన నారసింహహోమం, జోడు సేవోత్సవం తదితర పూజా కైంకర్యాలు గావించారు.




స్పటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు

18న యాదాద్రి హుండీ ఆదాయం లెక్కింపు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, నగలు ఇతర కానుకలను ఈ నెల 18వ తేదీన లెక్కించినట్లు దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదాద్రి కొండ కింద గల శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో హుండీల ఆదాయం లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని సూచించారు.

విప్లవాగ్ని రగిల్చిన వీర యోధులు



భీంరెడ్డి నర్సింహారెడ్డి (ఫైల్)

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ప్రపంచంలోనే ప్రత్యేక స్థానం ఉంది. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం ప్రజలే సాయుధులై ఈ పోరాటాన్ని నడిపారు. నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా.. దొరలు, జాగీర్దార్లు, జమీందార్ల ఆడగాలకు వ్యతిరేకంగా ఊళ్లకు ఊళ్లే తిరగబడ్డాయి. ఆనాడు కమ్యూనిస్టు పార్టీ నేతలు ప్రజల్లో చైతన్య స్ఫూర్తిని రగిలించి.. వారిని ముందుండి నడిపించారు. వారిలో ముఖ్యులు ఉమ్మడి జిల్లాకు చెందిన రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నర్సింహారెడ్డి. వీరి నాయకత్వంలో సాయుధ పోరాటం ఉవ్వెత్తున ఎగసింది.



సూర్యాపేట : భూస్వామ్య కుటుంబంలో పుట్టినా.. సామాజిక న్యాయమే శ్వాసగా పోరాడిన నేత భీంరెడ్డి నర్సింహారెడ్డి (బీఎన్). బడుగులు, పేదల బతుకులు బాగు చేసేందుకే జీవితాన్ని ధారపోశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దళ నాయకుడిగా పని చేసిన ఆయన పార్లమెంట్ సభ్యుడిగా మచ్చలేని జీవితాన్ని గడిపి భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారు. తన జీవితమంతా ప్రజా ఉద్యమాలతోనే గడిపారు.

ఆకలికి మూలమెక్కడ అన్న ఆలోచనతో..

భీంరెడ్డి నరసింహారెడ్డి స్వస్థలం తుంగతుర్తి మండలం కరివిరాల కొత్తగూడెం. భీంరెడ్డి రామిరెడ్డి- చొక్కమ్మ దంపతులకు 1922లో జన్మించారు. వీరిది భూస్వామ్య కుటుంబం అయినప్పటికీ తండ్రి భీంరెడ్డి రాంరెడ్డి పేదల పక్షాన ఉండేవారు. పస్తులతో సుస్తి చేసి సొమ్మసిల్లిన పాలేరును చూసి కలత చెంది ఆకలికి మూలమెక్కడ అన్న ఆలోచనలోంచి ఆయన ప్రస్థానం మొదలైంది. ఇక ఆంధ్ర మహాసభ నాయకుల ప్రసంగాలు ఆలోచింపజేసి ఉద్యమాలే ఊపిరిగా బతకాలన్న అభిప్రాయానికి వచ్చారు బీఎన్. వీటికి తోడు దేవులపల్లి వెంకటేశ్వరరావు సాహచర్యం బలంగా పనిచేశాయి.

బీడు భూములకు గోదావరి జలాలు తెచ్చిన నేత..

పాలకుర్తిలో కౌలుదారు ఐలమ్మ పక్షాన బువ్వ గింజల యుద్ధంలో విసునూరు దొరకు వ్యతిరేకంగా పోరాడారు. తర్వాత జరిగిన పరిణామాల్లో కమ్యూనిస్టులు ఆయుధాలు ధరించగా బీఎన్ స్వయంగా ఒక దళానికి నాయకత్వం వహించారు. 1947లో కోటపాడు, 1948లో కొడకండ్ల, 1949లో ఎల్లంపేటలో రైఫిల్ కాల్పుల్లో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. నలుగురికి ఆదర్శంగా ఉండాలని బాల్య వితంతువైన సరోజినిని వివాహం చేసుకున్నారు. రెండుసార్లు శాసనసభ్యుడిగా, మూడుసార్లు ఎంపీగా చట్టసభల్లో తనదైన శైలిలో ప్రజా సమస్యలను లేవనెత్తారు. ఆయన చట్టసభల్లో సూటిగా సమస్యను లేవనెత్తి పరిష్కారం దిశగా చర్చను కొనసాగించే వారు. బీఎన్ కృషి ఫలితంగా ఉమ్మడి జిల్లాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. పడావుబడ్డ భూములను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేయాలంటూ ఆనాడు బీఎన్ గొంతు విప్పడంతో.. ప్రస్తుతం సూర్యాపేట జిల్లాకు గోదావరి జలాలు అందుతున్నాయి.





రావి నారాయణరెడ్డి (ఫైల్)

భువనగిరి : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ధీరుడు రావి నారాయణరెడ్డి. భువనగిరి మండలం బొల్లేపల్లిలో 1904లో జూన్ 5న జన్మించిన ఆయన.. విద్యార్థి దశలోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. కాకినాడ వెళ్లి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. గాంధీ సిద్ధాంతాలకు అకర్షితుడై స్వగ్రామం బొల్లేపల్లి గ్రామంలో ఖాదీ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు నెలకొల్పారు. సోవియట్ రష్యా పురోభివృద్ధికి ఆకర్షితుడై కమ్యూనిస్టుగా మారారు.

రైతాంగ సేనాని..

ప్రపంచ చరిత్రలోనే ప్రత్యేక సిరాతో లిఖించిన రైతుకూలీల పోరాటాన్ని ముందుకు నడిపిన సేనాని రావి నారాయణరెడ్డి. రజాకార్లు, నిజాం సామంతులైన దేశముఖ్ ఆగడాలను ఎదుర్కొనేందుకు సాయుధ పోరాటానికి ఝంగ్ సైరన్ ఊదారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్, మెదక్, కరీంనగర్ జిల్లాల్లో మెజారిటీ ప్రాంతాల్లో ప్రజా ప్రభుత్వాలు ఏర్పరచి సమాంతర పాలన సాగించారు. ఒక దశలో కమ్యూనిస్టులు సంస్థానమంతా విస్తరిస్తారన్న వార్తల నేపథ్యంలోనే భారత ప్రభుత్వం ఆపరేషన్ పోలో అమలు చేసింది. రైతాంగ పోరాటమే లేకపోతే హైదరాబాద్ సంస్థానం భారతదేశ గుండెల మీద కుంపటిలా తయారయ్యేది. సాయుధ పోరాటం దేశ స్వతంత్ర, సమైక్యతకు కారణమైందని రావి తన ఆత్మకథలో రాసుకున్నారు.

నెహ్రూ కంటే ఎక్కువ మెజార్టీ..

1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో నల్లగొండ లోక్‌సభ నుంచి పోటీ చేసిన రావి నారాయణరెడ్డి.. నెహ్రూ కంటే ఎక్కువ మెజార్టీ సాధించారు. 1957, 1962లో భువనగిరి నుంచి శాసనసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1957లో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు. అసెంబ్లీకి రోజూ రిక్షాలో వెళ్లేవారు. 1967లో స్వచ్ఛందంగా రాజకీయాల నుంచి విరమణ పొందారు. అనంతరం అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. వందకు పైగా పాఠశాలలు, వసతి గృహాలు నిర్మించారు. పేదలకు 200 ఎకరాల తన సొంత భూమిని దానం చేశారు. పార్లమెంట్ సభ్యులుగా ఉన్నప్పుడు బీబీనగర్-నడికుడి రైలు మార్గం కోసం పోరాడారు. నాగిరెడ్డిపల్లి రైల్వే స్టేషన్ కోసం స్థలాన్ని ఇచ్చారు.

క్లుప్తంగా

జేఎన్‌వీలో ప్రవేశానికి గడువు పెంపు



పెద్దవూర: నాగార్జునసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయం(జేఎన్‌వీ)లో 2025-26 విద్యాసంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఆర్. నాగభూషణం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. విద్యార్థులు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే చదువుతూ, తల్లిదండ్రులు సైతం ఇదే జిల్లాలో నివాసం ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థి ప్రస్తుతం చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకంతో కూడిన ధ్రువీకరణ పత్రం, ఫొటోను దరఖాస్తునకు జతచేయాలని సూచించారు.

సాగర్ రెండు గేట్ల ద్వారా నీటి విడుదల



దిగువకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ నుంచి సోమవారం రెండు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి సాగర్ జలాశయానికి 68,327 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా అంతే నీటిని విడుదల చేస్తున్నారు. రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 22,366 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 28,948 క్యూసెక్కులు కలిపి మొత్తం 51,314 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలు, ఏఎమ్మార్పీ, వరద కాల్వలకు 17,013 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం ప్రస్తుతం 589.90 అడుగులుగా ఉంది.

ఘాటెక్కిన ఉల్లి, వెల్లుల్లి

- కిలో వెల్లుల్లి రూ.350పైనే..
- ఉల్లిగడ్డలు కిలో 70 రూపాయలు
- వంట నూనెలదీ అదేదారి
- నెల రోజుల్లో రెండింతలు పెరిగిన ధరలు
- కొనలేని స్థితిలో సామాన్యులు



నల్లగొండ టౌన్: వంటింట్లో ధర మంట మగ్గుతోంది. ప్రజలు ఉపయోగించే నిత్యావసరాల ధరలు నెల రోజుల క్రితంతో పోలిస్తే రెండింతలు పెరిగాయి. గత నెలలో ఉల్లిగడ్డ కిలో రూ.20నుంచి రూ.30 వరకు ఉండగా ప్రస్తుతం రూ.60 నుంచి రూ.70 వరకు పెరిగిపోయింది. అదేవిధంగా వెల్లుల్లి ధర గత నెలలో కిలో రూ.180 నుంచి రూ.200 వరకు ఉండగా నేడు రూ.350పైనే పలుకుతోంది. కేవలం నెల రోజుల వ్యవధిలోనే ప్రధాన నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. కూరల్లో ఉల్లి, వెల్లుల్లిని వేసుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటలు దెబ్బతినడమే కారణం

ఉల్లి, వెల్లుల్లి ధరలు నెల రోజుల వ్యవధిలోనే రెండింతలు పెరగడానికి కారణం కర్ణాటక, మహారాష్ట్రతోపాటు మన తెలుగు రాష్ట్రాల్లోనూ ఆయా పంటలు దెబ్బతినడమే కారణంగా వ్యాపారవర్గాలు అంటున్నాయి. ఆగస్టు నుంచి గత వారం క్రితం వరకు కూడా పెద్ద ఎత్తున వర్షాలు కురిసి వరదల కారణంగా ఉల్లి, వెల్లుల్లి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో మన రాష్ట్రాలకు సరఫరా కావాల్సిన ఉల్లి, వెల్లుల్లి తగ్గిపోయింది. దీంతో ధరలు అమాంతం పెరిగాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగి అవకాశం లేకపోలేదని వ్యాపారులు చెబుతున్నారు.

ఆయిల్ ధరలకూ రెక్కలు

కేంద్ర ప్రభుత్వం ఇటీవల సన్‌ఫ్లవర్, పామాయిల్‌పై జీఎస్టీని పెంచింది. దీంతో మూడు రోజులుగా వాటి ధరలు కూడా పెరిగిపోయాయి. సన్‌ఫ్లవర్ మూడు రోజుల క్రితం కిలో ప్యాకెట్ ధర రూ.110 ఉండగా ప్రస్తుతం రూ.130లకు పెరిగింది. పామాయిల్ రూ.95 ఉండగా ప్రస్తుతం రూ.120లకు చేరింది. వీటితోపాటు క్వింటా సన్నబియ్యం ధర ఏకంగా రూ.6,500లకు పెరిగింది. ప్రభుత్వం వెంటనే స్పందించి పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కొనలేని పరిస్థితి నెలకొంది



ఇప్పుడున్న ధరలు చూస్తే ఏమీ కొనలేని పరిస్థితి నెలకొంది. ఉల్లి, ఎల్లిపాయల ధరలు మండిపోతున్నాయి. ఇంత ధరలు ఎన్నడూ చూడలేదు. నూనె ధరలు కూడా పెంచారు. ప్రభుత్వాలు ఏం చేస్తున్నట్లు, సామాన్య ప్రజలు బతికేదెలా. ప్రభుత్వం స్పందించి వెంటనే ధరలు తగ్గించాలి.

– లక్ష్మమ్మ, అప్పాజీపేట, నల్లగొండ మండలం

మరింత పెరిగే అవకాశం ఉంది



నెల రోజుల వ్యవధిలోనే ఉల్లి, వెల్లుల్లి ధరలు రెట్టింపయ్యాయి. జీఎస్టీని పెంచిన కారణంగా మూడు రోజుల నుంచి పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరలు కూడా పెరిగాయి. వర్షాల నేపథ్యంలో పంటలు దెబ్బతినడంతో ధరలు పెరిగాయి. రానున్న రోజుల్లోనూ మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

– తడకమళ్ల వెంకటేశ్వర్లు, వ్యాపారి, నల్లగొండ

అరుణవర్ణ శోభితం



నల్లగొండ పరిధిలోని వల్లభరావు చెరువులోని నీరు సోమవారం సూర్యాస్తమయ సమయంలో ఎరుపు రంగులో కనువిందు చేసింది. గణేష్ విగ్రహాలను వల్లభరావు చెరువులోనే నిమజ్జనం చేయడంతో అక్కడికి వచ్చిన భక్తులను ఈ దృశ్యం ఆకట్టుకుంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, నల్లగొండ

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

వలిగొండ : టాటా ఏస్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం వలిగొండ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ యుగంధర్ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలం మల్కాపురం గ్రామానికి చెందిన మాలోతు బాల్యా, జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం లక్ష్మీతండాకు చెందిన బానోతు సునీల్ టాటా ఏస్ వాహనంలో 9.5కిలోల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా.. వలిగొండ మండలం రెడ్లరేపాక ఆవాసం మర్లపాడు గ్రామం వద్ద పోలీసులు పట్టుకున్నారు. వీరు గ్రామాల్లో రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ప్రైవేట్ వ్యాపారస్తులకు అధిక ధరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యంతోపాటు టాటా ఏస్ వాహనాన్ని సీజ్ చేసి వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేను, జగదీష్‌రెడ్డి మంచి మిత్రులం

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి



సూర్యాపేటలో గణేష్ శోభాయాత్ర కార్యక్రమంలో ఒకే వేదికపై జగదీష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి

సూర్యాపేట: మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డితో తనకు 35 సంవత్సరాల అనుబంధం ఉందని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలో భానుపురి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ శోభాయాత్ర కార్యక్రమంలో జగదీష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి ఒకే వేదికపైకి వచ్చి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. 'నాకు, జగదీష్‌రెడ్డి గురించి అందరూ అనుకునేవి అన్నీ అపోహలు మాత్రమే.. మా ఇద్దరి మధ్య శత్రుత్వం ఉందనుకుంటున్నారు.. కానీ మేమిద్దరం మంచి మిత్రులం' అని అన్నారు. సూర్యాపేటతో నాకు 40సంవత్సరాల బంధం ఉందన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకేనని అన్నారు. తర్వాత ఏ పండుగైనా కులమతాలు, పార్టీలకతీతంగా జరుపుకోవాలని సూచించారు. సూర్యాపేటలో బొడ్రాయి పునఃప్రతిష్ఠించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, ఆయా పార్టీల నాయకులు కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, భానుపురి ఉత్సవ సమితి అధ్యక్షుడు రంగరాజు రుక్మారావు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

తిప్పర్తి: బైక్‌పై వెళ్తూ యూటర్న్ తీసుకుంటున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన తిప్పర్తి మండలంలోని పాతపల్లి ఎక్స్ రోడ్ వద్ద జరిగింది. ఏఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. పాతపల్లి గ్రామానికి చెందిన ఎస్‌కే కఫీర్ (39) ఆదివారం సాయంత్రం నల్లగొండకు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై పాతపల్లి ఎక్స్ రోడ్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా.. హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కఫీర్ ఛాతి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు నల్లగొండ పట్టణంలోని ఐకాన్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి బావమర్ది షేక్ అహ్మద్‌పాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

న్యాయం చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

మిర్యాలగూడ అర్బన్: దామరచర్ల మండలం పుట్టలగడ్డ గ్రామంలో రెండు రోజుల క్రితం మౌనిక అనే యువతి తన ప్రియుడి ఇంటికి సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మౌనిక మృతికి కారణమైన వారిని శిక్షించాలని కోరుతూ ఆమె బంధువులు సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డులో గల గాంధీ విగ్రహం వద్ద ఆందోళనకు చేపట్టారు. వారికి పలు సంఘాల నాయకులు మద్దతు తెలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ నాగార్జున, రూరల్ సీఐ వీరబాబు అక్కడకు చేరుకుని మృతురాలి బంధువులతో మాట్లాడారు. చట్ట ప్రకారం నిందుతులను కఠినంగా శిక్షిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గరిడేపల్లి: మండలంలోని ఎల్బీనగర్ సమీపంలో సోమవారం సాయంత్రం రోడ్డు జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. హుజూర్‌నగర్ పట్టణంలోని దద్దనాల చెరువు కాలనీకి చెందిన వేషాల శివశంకర్ తన కుమారుడు భరణితో కలిసి సోమవారం సాయంత్రం మిర్యాలగూడలో బైక్ సర్వీసింగ్ చేయించుకుని హుజూర్‌నగర్ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో గరిడేపల్లి మండలం ఎల్బీనగర్ సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టడంతో కిందపడిపోయారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వారిని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం.

పాముకాటుతో వలస కార్మికుడు మృతి

చౌటుప్పల్ రూరల్: పాముకాటుకు గురైన వలస కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. చౌటుప్పల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోకు చెందిన వినోద్(33) నాలుగు నెలల క్రితం చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలో పోచంపల్లి వెళ్లే దారిలో ఉన్న ఓ పౌల్ట్రీఫాంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 13వ తేదీ రాత్రి పౌల్ట్రీఫాం బయట నిద్రిస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. తోటి కార్మికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లిదండ్రులు ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన తర్వాత పోస్టుమార్టం చేయనున్నట్లు ఎస్ఐ కృష్ణమాల్ సూర తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎస్ఐపై చేయి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు

సూర్యాపేట టౌన్: విధుల్లో ఉన్న ఎస్ఐపై చేయి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదయ్యింది. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన కుమ్మరికుంట్ల రాజు తమ వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు ఆదివారం సద్దల చెరువు వద్దకు వచ్చాడు. నిమజ్జనం అనంతరం వారి ట్రాక్టర్‌ను తీయాలని అక్కడే విధుల్లో ఉన్న ఎస్ఐ వెంకటేశ్వర్లు చెప్పగా.. తననే ట్రాక్టర్ తీయమంటావా అంటూ ఎస్ఐపై రాజు చేయి చేసుకున్నాడు. దీంతో రాజుపై కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట పట్టణ పోలీసులు తెలిపారు.


హైదరాబాద్ విమోచన వేడుకల్లో పాల్గొననున్న సతీష్ డప్పు కళాబృందం



పరేడ్ గ్రౌండ్‌లో రిహార్సల్ చేస్తున్న సతీష్ డప్పు కళాబృందం

గరిడేపల్లి: కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించనున్న హైదరాబాద్ విమోచన వేడుకల్లో గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన సతీష్ డప్పు కళాబృందం ప్రదర్శన ఇవ్వనున్నట్లు నిర్వాహకుడు అమరవరపు సతీష్ తెలిపారు. ఇందు కోసం 75మంది మహిళా డప్పు కళాబృందం సభ్యులు శనివారమే పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్నారని పేర్కొన్నారు.


రూ.లక్షలు పలికిన గణేష్ లడ్డూలు



హాలియా: వేలంలో లడ్డూ దక్కించుకున్న చింతపల్లి శ్రీనివాస్, పద్మావతి దంపతులు



కొండమల్లేపల్లి: వేలంలో లడ్డూను దక్కించుకున్న శ్రీనివాస్‌రెడ్డి దంపతులు



కోదాడ: లడ్డూ అందజేస్తున్న కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మిర్యాలగూడ: పట్టణంలోని రెడ్డికాలనీ రామాలయంలో యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను వేలంలో బండారు కుశలయ్య రూ.3,06,000కు దక్కించుకున్నారు. అదేవిధంగా గణేష్ మార్కెట్‌లో నిర్వహించిన వేలంలో రూ.1,76,016కు గుడిపాటి నవీన్‌కుమార్ లడ్డూను దక్కించుకున్నారు.

ఆలేరులో రూ.1,50,000..

ఆలేరురూరల్: ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేషుడి లడ్డూను సోమవారం వేలంలో తోకల అమరసింహారెడ్డి రూ.1,50,000కు కైవసం చేసుకున్నారు.

దాచారంలో రూ.1,00,110..

మోత్కూరు: మండలంలోని దాచారంలో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేశ్ లడ్డూను వేలంలో రూ.1,00,110కు మాజీ సర్పంచ్ అండెం రజితారాజిరెడ్డి దంపతులు దక్కించుకున్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్ వద్ద బాల గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం లడ్డూను వేలంలో రూ.1,51,000 వందనపు ఆంజనేయులు దక్కించుకున్నారు. మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి ఆలయంలోని గణేష్ మండపం వద్ద లడ్డూను రూ.1,21,000 ఉప్పల మోహన్ దక్కించుకున్నారు.

రూ.1.13లక్షలు పలికిన గణేష్ లడ్డూ

హాలియా: హాలియా మున్సిపాలిటీలోని ఆరుషి వినాయక కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూ వేలంలో రూ. 1,13,116లు పలికింది. ఆరుషి కాలనీకి చెందిన చింతపల్లి శ్రీనివాస్‌రావు, పద్మావతి దంపతులు వేలంలో లడ్డూను సొంతం చేసుకున్నారు. అదేవిధంగా అనన్య కమ్యూనిటీ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూను హాలియా పట్టణానికి చెందిన రిక్కల జానారెడ్డి-పద్మ దంపతులు వేలంలో రూ.2,01,116కు దక్కించుకున్నారు.

కొండమల్లేపల్లిలో రూ.1,15,116..

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని భరత్‌నగర్ కాలనీలో ప్రతిష్ఠించిన గణనాథుడి లడ్డూను వేలంలో ఉట్కూరి శ్రీనివాస్‌రెడ్డి రూ.1,15,116కు దక్కించుకున్నారు.

సూర్యాపేటలో రూ.1.20లక్షలు

సూర్యాపేట: పట్టణంలోని పూల సెంటర్‌లో భజన మందిరంలో నెలకొల్పిన వినాయకుడి లడ్డూను కొత్తూరి సందీప్ వేలంలో రూ.1.20లక్షలకు దక్కించుకున్నారు. ఈ లడ్డూను మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి చేతులమీదుగా సందీప్‌కు అందజేశారు.

రూ.1.15లక్షలు పలికిన లడ్డూ..

కోదాడ: పట్టణంలోని కాన్వాసింగ్ ఏజెంట్స్ ఏర్పాటు చేసిన వినాయక మండపం లడ్డూను వేలంలో షిరిడీసాయి లారీ సప్లై ఆఫీస్ యజమానులు వీరారెడ్డి, వీరబాబు రూ.1,15,116కు దక్కించుకున్నారు. వారికి కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ లడ్డూ అందజేశారు.

భువనగిరిలో..

భువనగిరి: పట్టణంలోని ఆజాద్ రోడ్డులో శ్రీరామ భక్త భజన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద లడ్డూను వేలంలో రూ.1.15లక్షకు కార్తీక్, బాలాజీ సంయుక్తంగా దక్కించుకున్నారు.